సాక్షి
ప్రకాశం
బుధవారం । 22 । నవంబర్ । 2023



చిరుజల్లులతో రైతన్న హర్షం

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో మంగళవారం పలుచోట్ల కురిసిన చిరుజల్లులతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - 8లో..



నిరుద్యోగులకు స్కిల్ హబ్ వరం

నిరుద్యోగులకు స్కిల్ హబ్ వరం లాంటిదని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. దర్శి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్‌ను ఆయన ప్రారంభించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29.7/24.8

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాఠశాలల ప్రభుత్వ గుర్తింపు రెన్యువల్ గడుపు పెంపుపై హర్షం

- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన అపుస్మా సంఘం



మాట్లాడుతున్న అపుస్మా సంఘ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల గుర్తింపు రెన్యువల్ కాలం మూడు నుంచి 8 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం జీవో నంబర్ 90ని విడుదల చేయటంపై ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అప్పుస్మా) సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఒంగోలు ఎంపీఏ భవనంలో మంగళవారం అపుస్మా సంఘ మీడియా సమావేశం నిర్వహించారు. అపుస్మా జోనల్ అధ్యక్షుడు ఏవీ సుబ్బారావు మాట్లాడుతూ ఈ జీవో అనేక ప్రైవేటు పాఠశాలలకు ఉపయుక్తంగా ఉందని, అందుకు సహకరించిన ఎమ్మెల్సీలు ఎంవీ రామచంద్రా రెడ్డి, పీ చంద్రశేఖర్ రెడ్డి, కల్పలతలకు కృతజ్ఞతలు తెలిపారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు కే మాధవరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీల విన్నపంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందించి జీవో 90 విడుదల చేశారని, సీఎంతో పాటు అందుకు సహకరించిన ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు, విద్యాశాఖాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంఘ కార్యదర్శి హనుమంతరావు మాట్లాడుతూ అపుస్మా సంఘ కృషితో అనేక పాఠశాలలకు ప్రయోజనం చేకూరుతుందని, జీవో ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ అపుస్మా అధ్యక్షుడు నలంద ప్రసాద్, సెక్రటరీ ప్రగతి స్కూల్ పరమేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

నలుగురు ఎస్సైలకు స్థానచలనం

ఒంగోలు టౌన్: నలుగురు ఎస్సైలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ మలికా గర్గ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీసీపల్లి పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ కనిగిరికి అటాచ్ చేసిన సబ్ ఇన్‌స్పెక్టర్ కె.మధవరావును కనిగిరి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. కనిగిరి పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న డి.ప్రసాద్ ను జిల్లా వీఆర్‌కు పంపించారు. జిల్లా వీఆర్‌లో ఉన్న జి.కోటయ్యను పీసీపల్లి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఒంగోలు వీఆర్‌లో ఉన్న ఆర్.సుమన్‌ను ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు అటాచ్ చేశారు.

సిఫార్సు చేసిన వంగడాలనే వినియోగించాలి

- గుంటూరు హెచ్‌ఓ పొగాకు ప్రొడక్షన్ మేనేజర్ క్రిష్ణశ్రీ

ఒంగోలు సెంట్రల్: పొగాకు బోర్డు అనుమతించిన మేరకు మాత్రమే రైతులు పండించాలని గుంటూరు పొగాకు బోర్డు ప్రొడక్షన్ మేనేజర్ డాక్టర్ ఎం క్రిష్ణశ్రీ అన్నారు. పొగాకు బోర్డు ఒంగోలు-2 పరిధిలోని త్రోవగుంట, కరువది, వలేటివారిపాలెం గ్రామాల్లో పొగాకు తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్డు ఎంపిక చేసిన వంగడాలను (ఎఫ్‌సీఆర్-15, సిరి) మాత్రమే సాగు చేయాలని చెప్పారు. నాణ్యమైన పొగాకు నారు మాత్రమే ఉపయోగించాలని కోరారు. ఈ వారం వాతావరణం మబ్బులతో కూడి ఉండటం వలన పచ్చ పురుగు, బొబ్బ తెగులు వచ్చే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఒంగోలు-2 వేలం కేంద్రం నిర్వహణాధికారి కోవి రామక్రిష్ణ, బోర్డు ఏఎస్‌లు జే తులసి, శంకుతల పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా మార్కాపురం రైల్వే స్టేషన్



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే ఇంజనీర్‌లు

మార్కాపురం రూరల్: అమృత్ భారత్‌లో భాగంగా మార్కాపురం రైల్వే స్టేషన్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆసీస్, అరుణ్ అసోసియేట్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎంఏఆర్ నోయల్, జగన్‌మోహన్‌రావు తెలిపారు. మంగళవారం మార్కాపురం రోడ్ రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్ల రూపాయలతో మార్కాపురం రైల్వే స్టేషన్‌లో ఉన్న సదుపాయలకన్నా అదనంగా రెండు లిఫ్టులు, ఒక ఎక్సలేటర్, ప్రయాణికుల కోసం ఏసీ వెయిటింగ్ హాల్, రెండో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్ఎస్‌జీ-4 కింద డివిజన్‌లోని మార్కాపురం రైల్వే స్టేషన్‌ను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. వీరి వెంట డీఆర్ యూసీసీ మెంబర్ ఆర్‌కేజీ నరసింహం, నరసింహాచార్యులు ఉన్నారు.

సాధికార నినాదం.. దద్దరిల్లేలా..

నా ఎస్సీ..నా ఎస్టీ..నా బీసీ..నా మైనార్టీ అంటూ ప్రసంగాల్లోనే కాకుండా ఆ వర్గాలకు పెద్దపీట వేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మొన్నటి వరకూ మాటలకే పరిమితమైన అణగారిన వర్గాల అభ్యున్నతిని ఆయన చేతల్లో చేసి చూపించారు. పాలన, సంక్షేమ పథకాల్లో సమున్నత స్థానాన్ని కల్పించారు. నాలుగున్నరేళ్ల పాలనలో జనం జై కొట్టేలా సామాజిక సాధికార విప్లవంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు చేపట్టిన బస్సుయాత్ర బుధవారం ఒంగోలు నగరంలో జరుగనుంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో భారీ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి.

- నేడు ఒంగోలులో భారీగా సామాజిక సాధికార యాత్ర
- బడుగు, బలహీన వర్గాలకు చేసిన మేలు వివరించేందుకు..
- కుల వృత్తుల వారీగా సిద్ధమవుతున్న శకటాలు
- మాజీమంత్రి, ఎమ్మెల్యే బాలినేని నేతృత్వంలో భారీ ఏర్పాట్లు



డివైడర్లపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ఒంగోలు సిటీ: అధికారంలోకి వచ్చిన వెంటనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతూ సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. గత ప్రభుత్వాలలాగా మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా జిల్లాలో పెద్ద ఎత్తున నామినేటెడ్ పదవులు సైతం కేటాయించారు. తన కేబినెట్‌లో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆదిమూలపు సురేష్‌కు చోటు కల్పించారు. అంతేకాకుండా మాదిగ కార్పొరేషన్, లిడ్‌క్యాప్, కృష్ణబలిజ ఇలా పలు కార్పొరేషన్లకు చైర్మన్ పదవులు ఇచ్చారు. పెద్ద ఎత్తున డైరెక్టర్ పదవులిచ్చారు. ఇలా అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల బతుకుల్లో మార్పును తీసుకొచ్చి చెరగని ముద్ర వేసుకున్నారు. వీటన్నింటినీ వివరించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సామాజిక సాధికార బస్సు యాత్ర' బుధవారం ఒంగోలు నగరానికి రానుంది. సామాజిక నినాదంతో నగరం దద్దరిల్లేలా భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా నిర్వహించని విధంగా 19 సామాజిక వర్గాల కులవృత్తుల శకటాలను ఏర్పాటు చేసి భారీ ర్యాలీ చేయనున్నారు. కులవృత్తుల వారీగా శకటాలు సిద్ధమయ్యాయి. యాత్రలో ఇది హైలెట్ కానుంది. కర్నూలు బైపాస్ నుంచి బాపూజీ కాంప్లెక్సు వరకు వేలాది మందితో భారీ ర్యాలీ జరగనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు పార్టీ అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యేలా పార్టీ శ్రేణులు దృష్టి సారించాయి. సామాజిక, సాధికార బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తున్నారు. యాత్ర సాగే మార్గంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లాలో ఇప్పటికే మార్కాపురం, కనిగిరి పట్టణాల్లో విజయవంతంగా బస్సుయాత్ర జరిగింది. మూడో సారి బుధవారం ఒంగోలు నగరంలో నిర్వహిస్తున్నారు.

ఈ యాత్రలో ముఖ్యఅతిథులుగా, రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయి రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, పురపాలకశాఖామంత్రి ఆదిమూలపు సురేష్, వైద్య ఆరోగ్యశాఖామంత్రి విడదల రజని, రాజ్యసభ సభ్యులు, బీసీ నాయకులు ఆర్.కృష్ణయ్య, ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డితో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారు.

సాధికార యాత్ర షెడ్యూల్ ఇలా..

- ఉదయం 11 గంటలకు ఒంగోలు నియోజకవర్గ మేధావులతో ఆత్మీయ సమావేశం నోవాసిస్ హోటల్ (ఆర్టీసీ డిపో ఎదురుగా)లో జరుగుతుంది. ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు, ముఖ్య నాయకులు పాల్గొంటారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు నోవాసిస్ హోటల్‌లో పాత్రికేయుల సమావేశం
- మధ్యాహ్నం 3 గంటలకు కర్నూలు బైపాస్ సమీపంలోని సెయింట్ జేవియర్స్ స్కూల్ వద్ద బస్సు యాత్రకు స్వాగతం పలుకుతారు. అక్కడ నుంచి బాపూజీ మార్కెట్ కాంప్లెక్సు వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తారు. వివిధ కులవృత్తుల శకటాలతో పాటు పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు, ప్రజలతో ర్యాలీ జరుగుతుంది.
- సాయంత్రం 4 గంటలకు అద్దంకి బస్టాండ్ సమీపం బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద భారీ బహిరంగ సభ

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పేదలు, బడుగు వర్గాలు ఎంతో సంతోషంగా ఉన్నాయి. ఆయా వర్గాలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ఈ బస్సు యాత్ర చేపట్టాం. మంత్రులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు ఈ యాత్రలో పాల్గొంటారు. తొలుత భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలని వివిధ వర్గాల ప్రజలతో పాటు కార్యకర్తలను కోరుకుంటున్నాం.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే

బస్సు యాత్ర విజయవంతం చేయండి



ఒంగోలు నగరంలో బుధవారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలి. బస్సు యాత్రలో అభిమానులు, కార్యకర్తలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మహిళలంతా పాల్గొనాలి.

– జంకె వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు



రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన కటౌట్లు, స్వాగత ఫ్లెక్సీలు

రిమ్స్‌లో రగడ

- మెడికల్ కాలేజీలో విద్యార్థుల మధ్య ఘర్షణ
- కాలేజీలో ఉద్రిక్త వాతావరణం
- ఘర్షణపై ఎస్పీ సీరియస్.. విచారణకు ఆదేశం
- ఇరువర్గాల మీద కేసులు నమోదు చేస్తామన్న డీఎస్పీ

ఒంగోలు టౌన్: వాళ్లంతా ఎంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు. కష్టపడి చదువుకొని మెడిసిన్లో సీటు సాధించారు. ఉన్నత చదువులు చదువుకొని వైద్యులుగా కుటుంబానికి, సమాజానికి సేవ చేయాల్సిన వాళ్లు తోటి విద్యార్థులతో గొడవలకు దిగుతూ నిత్యం ఘర్షణతో కాలం వెల్లబుచ్చుతూ తలనొప్పిగా తయారయ్యారు. ఒంగోలు మెడికల్ కాలేజీలో మూడో ఏడాది ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులు సోమవారం రాత్రి ఘర్షణకు దిగడం, తీవ్రంగా కొట్టుకోవడంతో సంచలనంగా మారింది. ఈ ఘర్షణలో ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో కాలేజీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు మెడికల్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల మధ్య కొంతకాలంగా ఘర్షణలు జరుగుతున్నాయి. మెస్ నిర్వహణ విషయంలో తలెత్తిన విభేదాలతో విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయినట్లు తెలుస్తోంది. విద్యార్థుల మధ్య తరచుగా ఘర్షణలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో 8 మంది విద్యార్థులను రెండు నెలల క్రితం కాలేజీ హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారు. అయితే కాలేజీ హాస్టల్ నుంచి సస్పెండు అయిన విద్యార్థులకు, మిగతా విద్యార్థులకు మధ్య సోమవారం మధ్యాహ్నం ఘర్షణ జరిగింది. ఈఎన్‌టీ క్లాసు పూర్తయిన తరువాత సస్పెండైన గ్రూపునకు చెందిన విద్యార్థి ఒకరు మిగిలిన వారిని ఉద్దేశించి బూతులు తిట్టడమే కాకుండా, ఒక విద్యార్థి మీద చేయి చేసుకున్నట్లు సమాచారం. దాంతో కొందరు విద్యార్థులు తిరగబడ్డారు. ఇరు వర్గాలు తరగతి గదిలోనే కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో సాదత్ అనే విద్యార్థికి తలకు గాయమైంది. ఈ ఘర్షణ జరిగినప్పుడు కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు సెలవు మీద విజయవాడ వెళ్లి ఉన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట రమణ విధులు నిర్వహిస్తున్నారు. వెంటనే స్పందించిన ఆయన ఇరువర్గాలకు చెందిన విద్యార్థులకు నచ్చచెప్పి పంపించారు. అయితే కథ అంతటితో ముగుస్తుందనుకున్నారు. కానీ క్లాస్ రూంలో జరిగిన ఘర్షణను జీర్ణించుకోలేని కొందరు విద్యార్థులు తిరిగి దెబ్బ తీయాలని ప్లాన్ చేశారు. శివసాయి, విజ్ఞత్ న అనే విద్యార్థులు 7.30 గంటల ప్రాంతంలో కాలేజీ గేటు వద్ద ఉన్న మెడికల్ షాపులో మందులు కొనేందుకు వెళ్లారు. ఈ లోపు అక్కడికి చేరుకున్న మరో గ్రూపు విద్యార్థులు వారి మోటారు వాహనాన్ని ధ్వంసం చేయడమే కాకుండా బండి తాళాలు తీసుకొని మీకు చేతనైతే సంఘమిత్ర హాస్పిటల్ సమీపంలో ఉంటాం...వచ్చి తాళాలు తీసుకొనిపొమ్మని సవాల్ విసిరారు. దాంతో బాయ్స్ హాస్టల్ విద్యార్థులు అక్కడికి చేరుకున్నారు. యశ్విన్ అనే విద్యార్థి మీద దాడి చేసి రాళ్లతో కొట్టారు. దీంతో అతడికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఇక్కడ కూడా ఇరువర్గాలకు చెందిన విద్యార్థులు ఘర్షణ పడ్డారు. ఈ ఘటన నగరంలో తీవ్రంగా సంచలనం సృష్టించింది. వైద్య విద్యార్థుల మధ్య జరిగిన విషయం తెలుసుకున్న ఎస్పీ మలికా గర్గ్ మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలును పిలిపించుకొని మాట్లాడారు. కళాశాలలో ఘర్షణ జరగడం పట్ల సీరియస్ గా పరిగణించిన ఎస్పీ విచారణకు ఆదేశించారు. దాంతో వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్, ఎస్ఐ మురళి కళాశాలలోని బాయ్స్ హాస్టల్‌లో విచారణ నిర్వహించారు.



ఘర్షణలో గాయపడిన షేక్ సాదత్



తీవ్రంగా గాయపడిన యశ్విన్

ఇరువర్గాలపై కేసులు పెడతాం – డీఎస్పీ

ఘర్షణకు దిగిన ఇరు వర్గాలకు చెందిన వైద్య విద్యార్థుల మీద కేసు నమోదు చేస్తున్నట్లు డీఎస్పీ వి.నారాయణ స్వామి రెడ్డి తెలిపారు. మంగళవారం తాలుకా పోలీసు స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఈఎన్‌టీ క్లాసులో జరిగిన సెమినార్ సందర్భంగా ఇరువర్గాలకు చెందిన విద్యార్థులు ఒకరి మీద మరొకరు కామెంట్లు చేసుకున్నారని, అదికాస్తా ఘర్షణగా మారిందని తెలిపారు. ఇందులో కులమతాల ప్రసక్తి లేదని, గంజాయి తాగి ఘర్షణకు దిగినట్లు సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం వాస్తవం కాదని చెప్పారు. కేవలం ఆధిపత్య ధోరణితో మాత్రమే ఘర్షణ జరిగినట్లు చెప్పారు. చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రెండు గ్రూపుల విద్యార్థుల సస్పెండ్: కాలేజీలో జరిగిన ఘర్షణలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు తెలిపారు. ఘర్షణలకు సంబంధించిన సమాచారాన్ని డీఎంఈకి తెలియజేసినట్లు చెప్పారు. ఘర్షణతో ప్రమేయమున్న ఇరువర్గాల విద్యార్థుల మీద సస్పెండు వేటు వేయాల్సిందిగా ఆదేశించారని చెప్పారు. అలాగే డీఎంఈ ఆదేశాల మేరకు ఘటన మీద విచారణకు గాను కమిటీ వేస్తున్నట్లు వెల్లడించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు



మత్స్యకారునికి ఇన్సులేటెడ్ వాహనం మంజూరు పత్రం అందజేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

- పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లతో తీర ప్రాంతం అభివృద్ధి
- పలు సంక్షేమ పథకాలతో మత్స్యకారులకు మేలు
- ప్రపంచ మత్స్య దినోత్సవంలో ఎంపీ మాగుంట

ఒంగోలు అర్బన్: సముద్ర తీర ప్రాంతాన్ని రాష్ట్రానికి సంపదగా మారుస్తూ మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావులతో కలిసి ఎంపీ పాల్గొన్నారు. కార్యక్రమంలో మత్స్యకారులకు రూ.20 లక్షల విలువ చేసే ఇన్సులేటెడ్ వాహనాలకు సంబంధించిన మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ 970 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం రాష్ట్రానికి ఉండటం ఒక వరమన్నారు. మన జిల్లాలో కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఎంతో మేలు చేస్తుందన్నారు. మత్స్యకార భవన నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తానన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బతుకుతెరువు కోసం ప్రకృతి వనరులపై ఆధారపడుతున్న మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నీ రకాలుగా అండగా ఉంటుందన్నారు.

మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంలోకి వేటకు వెళ్తున్న మత్స్యకారుల జీవితాల్లో ముఖ్యమంత్రి గణనీయమైన మార్పు తీసుకొచ్చారన్నారు.

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మత్స్యకారుల పడవలకు లీటరుకు రూ.9 సబ్సిడీతో డీజిల్, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల బీమా, కేసీసీ కార్డుల ద్వారా రుణాలు, ఆక్వా రైతులకు సబ్సిడీ విద్యుత్ వంటి పలు సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు రూ.397 కోట్ల మేరకు ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆల్ల రవీంద్రా రెడ్డి మాట్లాడుతూ కొత్తపట్నంలో రూ.392 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేస్తుండటంతో పాటు మత్స్యకారులకు అందుబాటులో ఉండేలా సచివాలయ స్థాయిలో ఫిషరీస్ అసిస్టెంట్‌లను నియమించి 50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు పింఛన్ వంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్ సుమతి, సంఘం నాయకులు వాయల మోహన్‌రావు, ఆప్కాబ్ న్యాయ సలహాదారు సైదా, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఉషాకిరణ్ పాల్గొన్నారు.

జనగళం



సొంతింటి కల జగనన్నతో సాకారం



మార్కాపురంలో అద్దె ఇంటిలో నివాసముంటున్నాను. ఒక ప్రైవేటు మెడికల్ కంపెనీలో పనిచేస్తున్నాను. ఇప్పటి వరకూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా సొంతిల్లు కట్టుకోవాలనే కల నెరవేరలేదు. జగనన్న ప్రభుత్వంలో నా కల నెరవేరబోతోంది. పట్టణ శివార్లలోని ఇడుపూరు-1 లేఅవుట్‌లో ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. హౌసింగ్ అధికారులు అన్నీ ఉచితంగా అందిస్తున్నారు. ఇంటి నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. నాకు ఇల్లు మంజూరు చేసినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– తాళ్లూరి రాంబాబు, మార్కాపురం

పాఠశాల చాలా బాగుంది

మా పాఠశాలలో ఒకటి నుంచి 8 తరగతులు ఉన్నాయి. గతంలో సరైన సౌకర్యాలు ఉండేవి కాదు. ప్రస్తుత ప్రభుత్వం నాడు-నేడు పనులతో అన్ని సౌకర్యాలు కల్పించింది. దీంతో మా పాఠశాలే కాదు మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందిస్తుండటంతో విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. విద్యార్థులకి డిజిటల్ విద్య అందుతోంది. గతంతో పోల్చితే ప్రభుత్వ విద్యలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. మా పాఠశాల చాలా బాగుంది.



– సూదనగుంట వెంకటస్వామి, ఉపాధ్యాయుడు, ఎంపీపీఎస్ పాఠశాల, వెంకటాయపాలెం, టంగుటూరు మండలం

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ వలన సర్జరీ చేయించుకున్నా



కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నాను. ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకునే స్తోమత లేదు. ఇంతలో మడనూరులో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌నకు వెళ్లి అన్ని వైద్య పరీక్షలు చేయించుకున్నాను. నాకు హెర్నియా ఉందని నిర్ధారించారు. సర్జరీ కోసం ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. స్పెషలిస్టు డాక్టర్లు ఆపరేషన్ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ వల్ల నా ఆరోగ్యం బాగుపడింది. క్యాంప్ పెట్టిన జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నా.

– పాలిచర్ల రాఘవరెడ్డి, మడనూరు, కొత్తపట్నం మండలం

అద్దె ఇంటి అవస్థలు తప్పాయి

నేను అద్దె ఇళ్లలో ఉంటూ నానా అవస్థలు పడేవాడిని. జగనన్న సీఎం అయ్యాక మాకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. మరికొంత డబ్బు కలిపి ఇల్లు కట్టుకున్నాను. మా ఇంటి గృహప్రవేశానికి వచ్చిన కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు రూ.10 వేలు ప్రోత్సాహకంగా అందించారు. సీఎం జగన్ వల్లే సొంత ఇంటి కల సాకారమైంది.

– షేక్ కరిముల్లా, ఆలకూరపాడు, టంగుటూరు మండలం



టంగుటూరులో షేక్ కరిముల్లా ఇంటి గృహ ప్రవేశంలో వరికూటి

క్లుప్తంగా

చోరీ కేసుల్లో బాలుడు అరెస్టు

కనిగిరి రూరల్: పట్టణంలో ఇటీవల జరిగిన పలు చోరీ కేసుల్లో నిందితుడైన బాలుడిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నక్షత్ర హోటల్‌తోపాటు పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడిన బాలుడు స్థానిక పొదిలి రోడ్డులోని టుబాకో బోర్డు వద్ద అనుమానస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలుడిని విచారించగా నేరాలు అంగీకరించడంతో అరెస్ట్ చేసి, జువైనల్ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై మాధవరావు తెలిపారు. బాలుడి స్వగ్రామం నెల్లూరు జిల్లా సీతారాంపురం. కాగా గత కొంత కాలంగా పొదిలిలోని తన పిన్నమ్మ వద్ద ఉంటూ, జులాయిగా తిరుగుతూ చోరీలకు అలవాటుపడినట్లు తెలిసింది.

వ్యక్తి బలవన్మరణం

యర్రగొండపాలెం: అనారోగ్యం, కుటుంబ సమస్యలతో ఒకరు ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన మంగళవారం స్థానిక సాయిబాబ గుడి వద్ద జరిగింది. గిద్దలూరుకు చెందిన తోట కృష్ణారావు (51) గత కొన్ని రోజుల క్రితం యర్రగొండపాలెం ప్రాంతంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న తన కుమారుడు వద్దకు వచ్చి ఉంటున్నాడు. ఆయన అనారోగ్యంతో బాధపడటమే కాకుండా కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడని పోలీసులు తెలిపారు. సమస్యలతో తీవ్ర కలత చెందిన కృష్ణారావు సాయిబాబ గుడివద్దకు తాడు తీసుకెళ్లి అక్కడ గుడి మెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. ఈ కేసును నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై ఎంపీ రాజేష్ తెలిపారు.

26న అరుణాచలానికి ప్రత్యేక బస్సుల ఏర్పాటు

ఒంగోలు సెంట్రల్: 26న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. గత ఆదివారం రెండు సూపర్ లగ్జరీ బస్సులు పంచరామాలు శైవ క్షేత్రాలకు వెళ్లి వచ్చినట్లు చెప్పారు. కృత్తికా నక్షత్ర దర్శనం (కార్తీక పౌర్ణమి) సందర్భంగా అరుణాచలానికి బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తిరుత్తణి, కంచి మీదుగా అరుణాచలానికి బస్సులు వెళ్తాయని తెలిపారు. 26 ఉదయం 7 గంటలకు అరుణాచలం బస్సు బయలుదేరుతుందన్నారు. రాత్రి పది గంటలకు పంచారామాలకు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టికెట్ ధర రూ.2 వేలుగా నిర్ణయించారన్నారు.

వెలుగొండ గురుకులంలో నాణ్యమైన భోజనం

మార్కాపురం: కొనకనమిట్ల మండలం వెలుగొండలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన ఒక దినపత్రికలో వచ్చిన కథనం(సాక్షి కాదు) అవాస్తవమని తెలిపారు. పాఠశాలలో 68 మరుగుదొడ్లు ఉన్నాయని, ఆర్ఓ వాటర్‌ప్లాంట్ ద్వారా రక్షిత నీటిని అందిస్తున్నామని స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్లు సక్రమంగానే సరఫరా అవుతున్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.



పూతకు వచ్చిన మిరప



సాగులో ఉన్న పొగాకు

చిరుజల్లులతో రైతన్న హర్షం

ఒంగోలు సెంట్రల్: బంగాళా ఖాతంలో ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో మంగళవారం పలు చోట్ల కురిసిన చిరుజల్లుతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు పలు పంటలు సాగు చేశారు. పొగాకు, శనగ సాగు ఊపందుకుంది. కంది, పత్తి, మిరప, జొన్న ఇతర పంటలకు ఈ వర్షం ఉపయుక్తంగా ఉంటుందని వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. అయితే ఖరీఫ్‌లో బోర్ల కింద సాగు చేసిన వరి పలు చోట్ల కోతకు రావడంతో ఈ వర్షం కొంత మేర ఇబ్బంది కలిగించే అవకాశం నెలకొంది.



కోతకు వచ్చిన వరి



దర్శి, అద్దంకి రోడ్‌లో కురుస్తున్న వర్షం

నిరుద్యోగులకు స్కిల్ హబ్ వరం



స్కిల్ డెవలప్‌మెంట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

- ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: నిరుద్యోగులకు స్కిల్ హబ్ వరం లాంటిదని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్ డీసీ స్కిల్ హబ్‌ను ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రారంభించారు. ముందుగా అద్దంకి రోడ్డులోని రామాలయం గుడి వద్ద మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ వారు నిర్వహించిన స్టాల్స్‌ను ప్రారంభించి స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం స్కిల్ హబ్‌ను ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశాలు కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేశారన్నారు. స్కిల్ హబ్ ద్వారా నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇప్పించడమే కాకుండా వారికి తగు ఉద్యోగాలను కూడా కల్పిస్తారన్నారు. క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం, మెళకువలతో ఉద్యోగంలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా ఉపాధి అధికారి టీ భరద్వాజ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ వారి సహకారంతో కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి తగ్గట్టు ఇక్కడ యువతకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడం శుభపరిణామం అన్నారు. అందరూ చక్కగా నేర్చుకుని రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ఎస్ సావిత్రి మాట్లాడుతూ స్కిల్ హబ్ ద్వారా అసోసియేటెడ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులు మూడు నెలల శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. రెండో విడతలో రెండు బ్యాచ్‌ల ద్వారా 60 మంది శిక్షణ పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ కొరివి ముసలయ్య, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అమీన్ బాషా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్పీ రమణ, నగేష్, స్కిల్‌హబ్ ఇన్‌చార్జ్ షేక్ ఈస్ బాషా, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసాచారి, హెచ్ అండ్ ఎమ్ఐఎస్ ఫిరోజ్, జే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి తెప్పోత్సవానికి భారీ ఏర్పాట్లు

- అన్ని శాఖల అధికారులు సహకరించాలి
- ఈఓ శ్రీనివాసరెడ్డి, సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ బాలాజీ విశ్వనాథ్ విజ్ఞప్తి



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి తెప్పోత్సవానికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఈఓ శ్రీనివాసరెడ్డి, సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ బాలాజీ విశ్వనాథ్ కోరారు. మంగళవారం సాయంత్రం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏటా కార్తీక మాసంలో క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవాన్ని కోనేరులో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈనెల 24న సాయంత్రం 5 గంటలకు తెప్పోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖాధికారులు సహకరించాలని ఈఓతోపాటు చైర్మన్ కేశవరావు విజ్ఞప్తి చేశారు. సీఐ భీమానాయక్ మాట్లాడుతూ.. 24న సాయంత్రం 4 గంటల నుంచి దోర్నాల–వినుకొండ వైపు నుంచి వచ్చే బస్సులు మార్కెట్ యార్డు నుంచి వై జంక్షన్, చెరువుకట్ట మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకునేలా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామని తెలిపారు. తెప్పోత్సవంలో పాల్గొనే అధికారులు, ప్రజాప్రతినిధుల పేర్లను తమకు ముందుగానే తెలియజేయాలని కోరారు. కోనేటి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని సూచించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ.. కోనేటి వద్ద సాయంత్రం 4 గంటల నుంచి ఉత్సవం ముగిసే వరకు అంబులెన్స్‌తోపాటు డాక్టర్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. సమావేశంలో కమిషనర్ గిరికుమార్, డీవైఎంహెచ్ఓ పద్మావతి, ఏడీఈ సీయానాయక్, కమిటీ సభ్యులు అర్జునరావు, డీటీ ఫర్వీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవానికి పటిష్ట బందోబస్తు

- డీఎస్పీ వీరరాఘవరెడ్డి



కోనేరును పరిశీలిస్తున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురంలో ఈనెల 24న నిర్వహిస్తున్న చెన్నకేశవస్వామి తెప్పోత్సవానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి పేర్కొన్నారు. ఉత్సవం నిర్వహించనున్న పుష్కరిణిని మంగళవారం సీఐ భీమానాయక్‌తో కలిసి పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై సూచనలిచ్చారు. కోనేటికి నలువైపులా పోలీసు బందోబస్తుతోపాటు గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అగ్నిమాపక సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాలని, డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి సిబ్బందిని రప్పించాలని సీఐని ఆదేశించారు. ఉత్సవానికి సుమారు 10 వేల నుంచి 12 వేలకు పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని డీఎస్పీకి ఈవో శ్రీనివాసరెడ్డి వివరించారు. ఆయన వెంట పట్టణ ఎస్సై సువర్ణ, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ విద్యతోనే ఉద్యోగ అవకాశాలు

- 75 శాతం మార్కులు పొందిన వారికి ఐటీలో కొలువులు
- ఈనెలాఖరు లోపు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి
- ప్రకాశం జిల్లా ఆర్ఐఓ సైమన్ విక్టర్

ఒంగోలు సెంట్రల్: ఇంటర్‌లోనే ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని జిల్లా ఆర్ఐఓ ఎ. సైమన్ విక్టర్, జిల్లా డీవీఈఓ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్ బి, ఇంటర్ బోర్డు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటికే ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలకు అవగాహన కల్పించామని చెప్పారు. ఈనెలాఖరు లోపు విద్యార్థులు నమోదు చేసుకోవాలని కోరారు. 2022–23 విద్యాసంవత్సరంలో 75 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు, ప్రస్తుతం సీనియర్ ఇంటర్ విద్యార్థులు ఈ ఉద్యోగాలకు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్న విద్యార్థులకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఎంపీసీ, ఎంఈసీ విభాగానికి చెందిన విద్యార్థులు ఐటీ రంగంలో, ఇతర గ్రూపులకు చెందిన వారికి అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన డీపీఓ విభాగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం ఏడు నెలల నుంచి పదివేలు స్టైఫండ్ కంపెనీ చెల్లిస్తుందని తెలిపారు. ఎంపికయిన విద్యార్థులు తమ విద్యను కొనసాగిస్తూనే ఉద్యోగాలు చేసుకవోచ్చని చెప్పారు. అందులో కొంత భాగం హెచ్‌సీఎల్ కంపెనీ చెల్లిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం టెక్నికల్ అడ్వజర్ రాజ్ కుమార్ ఫోన్‌నంబర్ 7780323850ను సంప్రదించాలని తెలిపారు.

డిపో మేనేజర్లకు అవార్డులు

ఒంగోలు సెంట్రల్: ఆర్టీసీలో ఉత్తమ సేవలు, అధిక ఆదాయం సంపాదించిన డిపో మేనేజర్లను ఎండీ ద్వారకా తిరుమల రావు అభినందించారు. దసరా పండగను పురస్కరించుని 412 ప్రత్యేక సర్వీసులను 2.47లక్షల కిలోమీటర్లు నడిపి రూ. 1.05 కోట్ల ఆదాయం గడించిన ప్రకాశం జిల్లా ప్రజా రవాణాధికారి బి. సుధాకర్, కనిగిరి డిపో నుంచి రాష్ట్ర స్థాయిలో 153 సర్వీసులతో 90వేల కిలోమీటర్లు నడిపి రూ. 42 లక్షలు ఆదాయం సమకూర్చిన కనిగిరి డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ, మార్కాపురం డిపో నుంచి 106 సర్వీసులతో 52 వేల కిలోమీటర్లు నడిపి రూ. 24 లక్షలు ఆదాయం సంపాదించిన మార్కాపురం డిపో మేనేజర్ నరసింహులును అభినందించి, ప్రశంస పత్రాలు అందించారు.



ఎండీ తిరుమలరావు నుంచి అవార్డులు అందుకుంటున్న మేనేజర్లు

ట్రాక్టర్ కింద పడి రైతు మృతి

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని తూర్పుగంగవరం గ్రామానికి చెందిన యాడిక చిన సుబ్బారెడ్డి (59) రైతు తన నడుపుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో దాని కింద మృతి చెందినట్లు ఏఎస్ఐ మోహనరావు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. చిన సుబ్బారెడ్డి సోమవారం తనకు గల పొలం దున్నేందుకు ట్రాక్టర్‌తో పొలం వెళ్లారు. పొలం దున్నిన అనంతరం సాయంత్రం ఇంటికి వెళ్తుంగా మార్గ మధ్యంలో ఎన్ఎస్‌పీ కాలువ కట్టపై పాము అడ్డు రావడంతో దానిని తప్పించబోయి అదుపు తప్పి ట్రాక్టర్ కాలువలో తిరగపడటంతో చిన సుబ్బారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య యాడిక వెంకట లక్ష్మమ్మ, కుమారుడు ఉన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ మోహనరావు

లోపరహిత ఓటర్ల జాబితా లక్ష్యం



సమావేశం నిర్వహిస్తున్న జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోల భాస్కర్

- జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోల భాస్కర్

ఒంగోలు అర్బన్: లోపరహితమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో బీబీబీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పని చేయాలని హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్, జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోల భాస్కర్ ఆదేశించారు. ఆ దిశగా రాజకీయ పార్టీలు కూడా తమవంతు పాత్ర పోషించాలని కోరారు. మంగళవారం ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. దీనిలో పోలా భాస్కర్ మాట్లాడుతూ బీఎల్ఓలు తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో నిబంధనలు ఉల్లంఘించకుండా పనిచేయాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నా సంబంధిత దరఖాస్తులు ఫిజికల్‌గా కూడా బీఎల్ఓల వద్ద ఉండాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి స్థాయిలో బీఎల్ఏలను నియమించుకుని బీఎల్ఓలకు సహకరించేలా రాజకీయ పార్టీలు కూడా సహకరించాలన్నారు. బీఎల్ఓలు, బీఎల్ఏలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఏలకు ప్రత్యేక గుర్తింపు కార్డులను ఇచ్చి వారి పనితీరును ఏఈఆర్ఓలు పరిశీలిస్తూ ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను కచ్చితంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల జాబితాలో జంక్ క్యారెక్టర్స్ లేకుండా చూడాలన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం నియోజకవర్గ స్థాయిలో, జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వీప్ కార్యక్రమం ద్వారా 18 ఏళ్లు నిండిన వారికి ఓటరుగా నమోదు చేసుకునేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు విశ్వేశ్వర రావు, జాన్‌ఇర్విన్, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, కాలేషా, రాజశేఖర్, సత్యనారాయణ, రసూల్, రఘు, సదర్శన్, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థినితో హెచ్‌ఎం అసభ్య ప్రవర్తన!

- చితకబాది పోలీసులకు అప్పగించిన స్థానికులు

మద్దిపాడు: విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడంటూ ప్రధానోపాధ్యాయుడిని కాలనీవాసులు చితకబాదిన ఘటన మద్దిపాడు మండలంలోని పెదకొత్తపల్లి అంజయ్య నగర్‌లో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. ఒంగోలు క్లోపేటకు చెందిన సుందర్‌బాబు పెదకొత్తపల్లి అంజయ్య నగర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఆయన పాఠశాలలోని బాత్‌రూమ్‌లను ఫొటో తీసి స్కూల్ యాప్‌లో అప్‌డేట్ చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలోనే ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కోపోద్రిక్తులైన స్థానికులు హెచ్‌ఎంను చితకబాది పాఠశాల గదిలో ఉంచి పోలీసులకు సమాచారం అందించారు. మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రధానోపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడానికి ప్రయత్నించారు. అయితే స్థానికులు అడ్డుతగిలి హెచ్‌ఎంపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చి హెచ్‌ఎంను స్టేషన్‌కు తరలించారు.

హెచ్‌ఎంపై వేటు

పాఠశాలలో చోటుచేసుకున్న ఘటనపై డీఈఓ వీఎస్ సుబ్బారావు ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఎంఈఓ–1 ఎంవీఆర్ ఆంజనేయులు, ఎంఈఓ–2 ఎం.శ్రీనివాసరావు పాఠశాల విద్యార్థినులు, స్థానికులతోపాటు ప్రధానోపాధ్యాయుడు సుందర్‌బాబుతోనూ మాట్లాడారు. విచారణ నివేదికను డీఈఓకు అందజేయగా హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌ఎం సుందర్‌బాబు మరో నాలుగైదు నెలల్లో పదవీ విరమణ చేయనున్నట్లు తెలిసింది.

జిల్లా స్థాయి క్యారమ్స్ జట్ల ఎంపిక

ఒంగోలు సెంట్రల్: జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్–14, అండర్–17 క్యారమ్స్ పోటీలకు మంగళవారం ఎంపికలు నిర్వహించారు. హైదరీ క్లబ్‌లో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వనజ ఎంపికలను ప్రారంభించారు. బాలికలు 40 మంది, బాలురు 50 మంది పాల్గొన్నారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. పీడీలు సోమినేని సురేష్, జాహ్నవి ప్రియ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ఎంపిక చేశారు.



ఎంపికలో సెలక్ట్ అయిన బాల బాలికలు

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు కనిగిరి విద్యార్థినులు

కనిగిరి రూరల్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు కనిగిరి ఎమ్మెస్సార్ బాలిక కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ఖోఖో సంఘ జిల్లా కార్యదర్శి, పీడీ బీ కాశీవిశ్వనాథరెడ్డి తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి బాలికల జట్టుకు ఎమ్మెస్సార్ కళాశాలకు చెందిన బీ శ్రీజ, ఆర్ యశోద, ఐ సిరి, పీ నందిని, కే ఊహ, జీ భవాని, ఎం సుమతి, ఎం సభియా, కే వర్షిణి, ఆర్ భవ్యశ్రీ, టీ సుస్మిత, కే అఖిల ఎంపికయ్యారు. ఈమేరకు క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ టీ వెంకటరెడ్డి, మాగుంట రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాఘవరెడ్డి, సలహాదారు డీ కృష్ణారెడ్డి, ఖోఖో సంఘ జిల్లా కార్యదర్శి బీ కాశీ విశ్వనాథరెడ్డి, కోచ్‌లు, వై శ్రీనివాసులరెడ్డి, బీ నాగలక్ష్మి, ఎం ఆదినారాయణ తదితరులు అభినందించారు.



రాష్ట్ర క్రీడా జట్టును అభినందిస్తున్న పీడీ, ప్రిన్సిపాల్ తదితరులు